క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఈపూరు: మండలంలోని వనికుంట గ్రామంలో నిర్మించిన సాయిబాబా దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామివారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బండ్లమోటు ఎస్ఐగా గల్లా రవికృష్ణ



బొల్లాపల్లి: బండ్లమోటు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా గల్లా రవికృష్ణ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ జె.బలరాంరెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా శావల్యాపురం స్టేషన్ ఎస్ఐ జి. రవికృష్ణ బండ్లమోటు స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

శావల్యాపురం ఎస్సై బదిలీ

శావల్యాపురం: స్థానిక పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై గల్లా రవికృష్ణ సాధారణ బదిలీపై వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం పోలీసు స్టేషనుకు బదిలీ అయ్యారు. గత ఏడాదిలో విధుల్లో చేరి శాంతి భద్రతల విషయంలో మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందారు. నూతన ఎస్సై త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారు.

పది మందిపై కేసు నమోదు

నాదెండ్ల: గేదెల రాకపోకల విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పది మందిపై కేసు నమోదైనట్లు ఎస్సై ఎ.భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, సాతులూరు ఎస్సీ కాలనీలో బుధవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కోటా ప్రభుదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రావుల సురేష్, బండారుపల్లి సత్యనారాయణ, చుండి అనిల్‌లపై కేసు నమోదు చేశారు. కోటా శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటా ప్రభుదాసు, రాజేష్, అనిల్, చిన పోలుబాబు, ఏసోబు, కోటయ్య, పవన్‌లపై కేసు నమోదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి ఉదయం తాగునీటి సరఫరా నిలిపివేత

నరసరావుపేట: పట్టణంలో ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా చేసే పైపుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాల్సిన దృష్ట్యా శుక్రవారం ఉదయం పూట పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతులు గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు కొనసాగుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి యథావిధిగా నీటి సరఫరా చేస్తామన్నారు.

ఎనిమిది మంది పేకాట రాయుళ్లు అరెస్టు

నరసరావుపేట టౌన్: పట్టణంలోని శ్రీ నిధి గ్రాండ్‌లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు వెల్లడించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

నరసరావుపేట ఈస్ట్: శాంతి, సహనం, త్యాగాలకు ప్రతీక బక్రీద్ పర్వదినమని పేష్ ఇమామ్ షాహిద్ రజా తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రకాష్ నగర్‌లోని ఈద్గా మైదానంలో గురువారం ముస్లింలు ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాంపురం జామీయా మసీద్ పేష్ ఇమామ్ షాహిద్ రజా ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. తోటివారి పట్ల సమానత్వాన్ని చూపుతూ సామరస్యంతో జీవనం కొనసాగించాలని తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ముస్లిం సమాజం జరుపుకునే అతి పెద్ద పండుగ బక్రీద్ అని స్పష్టం చేశారు. పేదవారి పట్ల ఆదరణ కలిగి ఉండాలని హితవు పలికారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: భగవంతుడిపై అచెంచల విశ్వాసం, త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని ముస్లిం మత పెద్ద, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇమామ్ సర్ఫరాజ్ చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు జరిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాతులూరులో జరిగిన కార్యక్రమంలో ఇమామ్ షేక్ ఫయాజ్ మాట్లాడుతూ, తన కలలో కనిపించిన సర్వేశ్వరుడి ఆజ్ఞను నెరవేర్చేందుకు ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడు ఇస్మాయీల్‌ను బలిచ్చేందుకు సిద్ధపడ్డారని, ఆయన త్యాగానికి మెచ్చిన భగవంతుడు ఇస్మాయీల్ స్థానంలో గొర్రెను ఏర్పాటు చేసి బలిని పూర్తి చేశారని చెప్పారు. దేవుడిపై భక్తి, విశ్వాసానికి ఇబ్రహీం ప్రవక్త జీవితం ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దేవుని మెప్పించేలా జీవించాలని, ధనవంతులు తమ ధనంలో తప్పనిసరిగా కొంతభాగాన్ని పేదవారి శ్రేయస్సుకు వెచ్చించాలన్నారు. అందరూ సంతోషంగా ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: త్యాగనిరతికి.. ధర్మనిబద్ధతకీ ప్రతీక అయిన బక్రీద్ పండుగను మండలంలోని ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. యడ్లపాడు, బోయపాలెం, కారుచోల గ్రామాల్లోని ఈద్గా మైదానాల్లో ఈద్ నమాజ్‌ను చదివారు. మిగిలిన గ్రామాల్లోని మసీదుల్లో పండగ ప్రార్థనలు చేశారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని దైవ పరీక్షలో కట్టుకున్న భార్యని వదిలి కన్న కొడుకు ప్రాణాలను బలిచ్చేందుకు సిద్ధపడిన మహనీయుడు త్యాగానికి గుర్తుగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారని మతపెద్దలు బోధించారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే ఈ పండుగ ఇచ్చే సందేశం అన్నారు. దైవం ప్రసన్నం కోసం తమ కిష్టమైన ఎలాంటి వస్తువునైనా త్యాగం చేయాలని ఖుర్బానీ ప్రత్యేకతని తెలిపారు. సామూహిక నమాజు అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ సంతోషంగా ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. ఇళ్ల వద్ద ఖుర్బానీ కింద పొట్టేళ్ల మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు. యువకులు తలనీలాలను ఖుర్బానీ కింద తీయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లిం వాడల్లో సందడి నెలకొంది. సాయంత్రం ముస్లిం యేతరుల్ని విందు భోజనాలు ఏర్పాటు చేసి ఆనందంగా గడిపారు.



వినుకొండలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలో వేల్పూరు, శానంపూడి, కారుమంచి, శావల్యాపురం తదితర, గ్రామాల్లో ముస్లిం సోదరులు ఘనంగా బక్రీదు పర్వదినాన్ని గురువారం జరుపుకున్నారు. మండల కేంద్రం శావల్యాపురంలో బిలాల్ మసీదులో ప్రార్థనలు జరిగాయి. ఈసందర్భంగా ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి మసీదుల్లో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈపూరులో...

ఈపూరు: మండలంలో బక్రీద్ పర్వదినాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల, కొండ్రముట్ల ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): ముస్లింలు బక్రీదు పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు, జామియా మసీదులతో పాటు పలు మసీదుల్లో ప్రార్థనల అనంతరం తిమ్మాయపాలెం రోడ్డులోని ఈద్గా వద్దకు పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకొని సామూహిక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీదు శుభాకాంక్షలు తెలియజేశారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒక్కరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలో పలుగ్రామాలలో గల మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మండలంలో విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట, గోగులపాడు, రొంపిచర్ల, కర్లకుంట, సంతగుడిపాడు, అలవాల, మునమాక, విప్పర్లపల్లి, అన్నవరం తదితర గ్రామాలలో గల ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టత గురించి వివరించారు.



రొంపిచర్ల ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు



గణపవరం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు



బోయపాలెం ఈద్గా వద్ద బక్రీద్ పండుగ విశిష్టతను వివరిస్తున్న హాఫీజ్‌సాబ్



ముప్పాళ్లలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



నరసరావుపేట ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ముఫ్తీ పఠాన్ అనస్ ఖాన్ చెప్పారు. బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ఉదయం అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో వేలాది మంది సామూహిక నమాజు చేశారు. నమాజు నిర్వహింప చేసిన అనస్‌ఖాన్ మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం, దేవుని (అల్లా) ప్రసన్నం కోసం చేసిన అసమాన త్యాగాన్ని స్మరిస్తూ ప్రతిఏటా బక్రీద్ పర్వదినాన్ని నిర్వహిస్తారని చెప్పారు. స్వార్థం, అహం ఉన్న చోట మానవత్వం పరిమళించదని, సంకుచిత ధోరణి వీడితే త్యాగం పరిఢవిల్లుతుందని వివరించారు. నేను–నాది అనే భావాన్ని వీడాలని అహంకారం, అసూయ, స్వార్థం మనసు నుంచి తొలగించాలని లోకానికి తెలిపేదే బక్రీద్ అని వివరించారు. ముందుగా ముఫ్తీ ఖలీల్‌ఖాన్ పండుగ విశేషాలను వివరించారు. ప్రార్థనల అనంతరం పెద్దలు, చిన్నలు బక్రీదు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రార్థనల ఏర్పాట్లను అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



చిలకలూరిపేట ఈద్గా మైదానంలో బక్రీదు ప్రార్థనలలో ముస్లింలు

మంత్రి రజిని చొరవతో సమస్యకు పరిష్కారం

నాదెండ్ల: చందవరం గ్రామంలో ముస్లిం శ్మశాన వాటికకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చొరవతో పరిష్కారం లభించింది. దీంతో ఆ గ్రామ ముస్లిం పెద్దలు గురువారం మంత్రి రజినిని కలిసేందుకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి తరలి వచ్చారు. మంత్రి రజిని అందుబాటులో లేకపోవటంతో మున్సిపల్ కౌన్సిలర్, సీనియర్ నాయకులు విడదల గోపిని కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శ్మశాన వాటిక కేసు అరవై ఏళ్లుగా కోర్టులో ఉందని, మంత్రి రజిని ప్రత్యేక చొరవ చూపి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేశారన్నారు. దీంతో గ్రామ ముస్లింలకు శ్మశాన వాటిక సమస్య తీరిందన్నారు.

నాలుగు రోడ్ల అభివృద్ధికి శ్రీకారం



పనులు ప్రారంభించేందుకు పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు

రొంపిచర్ల: మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో రైతుల అభ్యర్థన మేరకు పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నాలుగు రోడ్ల అభివృద్ధికి గురువారం శ్రీకారం చుట్టారు. ప్రొక్లెయిన్లతో 4 కిలోమీటర్ల పొడవుగల 4 రోడ్లు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇండెం శ్రీనివాసరెడ్డి, రాజనాల పోలిరెడ్డి, పాలూరి పేరిరెడ్డి నాయకులు పాల్గొని పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. నాలుగు రోడ్ల నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేస్తున్న శాసనసభ, పార్లమెంట్ సభ్యులను గ్రామ పెద్దలు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు అభినందించారు.

విత్తనాలు కొంటున్నారా?

- అయితే ఈ జాగ్రత్తలు పాటించండి
- సూచనలు చేసిన ఏడీఏ రవికుమార్



శావల్యాపురం: ఖరీఫ్ సీజనుకు రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈసందర్భంగా ఏడీఏ బోయపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కోనుగోలు చేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

జాగ్రత్తలు ఇవీ...

- అనుమతులు ఉన్న డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనాలి
- తప్పనిసరిగా రసీదును తీసుకోవాలి
- కంపెనీ పేరు లేని విత్తనాలు, లూజుగా కేజీల చొప్పున విక్రయిస్తున్నా విత్తనాలు కొనద్దు.
- గడువు దాటిన విత్తనాలు, చినిగిన ప్యాకెట్లు మార్కెటు ధర కంటే తక్కువ ధరకే విక్రయిస్తామని చెప్పే విత్తనాలను అస్సలు కొనకండి.
- రైతులకు అందజేసే బిల్లుపై విక్రయదారుడు పేరు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అమ్మకపు నంబరు రైతు పేరు, గ్రామం విక్రయదారుడు సంతకం గడువు తేదీ, బ్యాచ్ నంబరు, నికర తూకం, తదితర వివరాలు నమోదు చేసుకోవాలి.
- అలాంటి బిల్లునే రైతు డీలరు వద్ద నుంచి తీసుకోవాలి.
- కొనుగోలు చేసిన ప్యాకెట్లుపై కంపెనీ సీల్ ఉందో, లేదో రైతులు గమనించాలి.
- విత్తన విక్రయదారుడు ఇచ్చే రసీదు క్షుణ్ణంగా పరిశీలించాలి.
- మొలకెత్తే పూత దశలో లోపాలు కనిపిస్తే వ్యవసాయ శాఖఅధికారులకు సమాచారం అందించాలి.
- విత్తనం కొనుగోలు చేసిన తర్వాత ముందుగా మొలక శాతాన్ని పరిశీలన చేయాలి.
- సంతృప్తిగా ఉంటేనే నాటాలి. తద్వారా నష్టాన్ని నియంత్రణ చేయవచ్చు.
- విక్రయదారుడు ఇచ్చే బిల్లును పంట పూర్తి అయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.
- అరువు పద్ధతిలో (అప్పు) విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు ఖచ్చితంగా తీసుకోవాలి.
- నర్సరీలో మిర్చి నారు తీసుకునేటప్పుడు కూడా రైతులు వారి నుంచి రసీదు పొందటంతో పాటు ఏ రకం విత్తనం అయి ఉంటుందో స్పష్టంగా రాయించుకోవాలి.

ఆలయాలకు తొలి ఏకాదశి శోభ

- భక్తులతో ఆలయాలు కిటకిట
- స్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు
- నరసరావుపేటలో పేలాలపిండి పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి శంకర మఠంలోని శంకర చంద్రమౌళీశ్వర స్వామి వారికి శత రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు జరిపారు. మఠంలోని భారతీ తీర్థస్వామి మండపంలో రుద్రహోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. బరంపేటలోని రాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. పాతూరు శివాలయం, భూనీల, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, పాండురంగస్వామి ఆలయం తదితర ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం నడిబొడ్డున ఉన్న శివుని బొమ్మకు ప్రత్యేక అలంకరణలు చేశారు. విశ్వజననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివుని బొమ్మ వద్ద తొలి ఏకాదశి సంప్రదాయ ప్రసాదం పేలపిండిని పంపిణీ చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో అన్ని శైవ క్షేత్రాలు గురువారం కిటకిటలాడాయి. ఉదయాన్నే శివాలయాలను సందర్శించి పూజలు, అభిషేకాలు జరిపారు. నూతన దంపతులు త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. చిరుమామిళ్లలో కొలువైయున్న కోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు తొలి ఏకాదశి వేడుకలు జరిపారు. ఆలయ ధర్మకర్త కొల్లిపర శ్రీనివాసరావు, కమిటీ అధ్యక్షులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, విశిష్ట అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయం వద్ద కోలాట ప్రదర్శన నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ చేశారు. స్వామివారి దర్శనార్థం కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని కారుమంచి, వేల్పూరు, గంటావారిపాలెం, శావల్యాపురం, పోట్లూరు, మతుకుమల్లి తదితర గ్రామాల్లో తొలిఏకాదశి పండుగ వేడుకలు భక్తులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచి భక్తులు శివాలయాల్లో శివుడిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు చేశారు. మండలం కేంద్రంలో వేంచేసియున్న రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఉపవాసాలు, నియమాలు ఆచరించి శివుడిని కొలిచారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి సన్నిధిలో మహిళలు పొంగళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో గురువారం తొలిఏకాదశి పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ పండుగ నుంచే హిందువుల పండుగలు ప్రారంభమవుతాయని కనుక ప్రజలు నూతన వస్త్రాలను ధరించి ఇళ్ళల్లో పూజలు నిర్వహించారు. సాంప్రదాయక వంటకాలైన శనగ, అలచంద గుగ్గిళ్ళు, జొన్నలు బెల్లంతో తయారు చేసిన పేలపిండిని ప్రసాదాలుగా పంపిణీ చేశారు. మండలంలో పలుగ్రామాలలో గల ఆలయాలను భక్తులు, మహిళలు అధికసంఖ్యలో సందర్శించి స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో గల శివాలయం, షిర్డీ సాయిబాబా, వేణుగోపాలస్వామి, వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయం, విప్పర్ల శివాలయం, కొత్తపల్లి డొంకవద్ద గల సంజీవ ఆంజనేయస్వామి, వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి తదితర ఆలయాలు భక్తులతో నిండాయి. పండుగను పురస్కరించుకొని కొందరు భక్తులు ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ, గుత్తికొండ బిల్లం, వినుకొండ, చేజర్లలకు తరలివెళ్ళారు.



గంటావారిపాలెంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



నరసరావుపేటలో శివుని బొమ్మ వద్ద పేలపిండిని పంపిణీ చేస్తున్న దృశ్యం



నరసరావుపేటలో ప్రత్యేక అలంకరణలో ఇస్కాన్ రాధా గోవిందులు



దీపపు కాంతులలో విప్పర్ల శివయ్య

పట్టుదలకు ప్రతీక ఏకలవ్యుడు

చిలకలూరిపేట: కృషి, పట్టుదలకు ప్రతీక ఏకలవ్యుడని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ చెప్పారు. సంఘ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు విద్యను నేర్పేందుకు నిరాకరించినా పట్టుదల, స్వయం కృషితో విలువిద్య నేర్చుకున్న వీరుడని కొనియాడారు. విద్య నేర్పినప్పటికీ ద్రోణాచార్యుడు అడిగిందే తడవుగా బొటన వేలును త్యాగం చేసిన మహావీరుడని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు బి.చిన్నా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, రాంబాబునాయక్ పాల్గొన్నారు.



ఏకలవ్యుడి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

విత్తనాల షాపులపై విజిలెన్స్ దాడులు

క్రోసూరు: క్రోసూరు లోని విత్తనాల షాపులను విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేసినట్లు ఏఓ వేణుగోపాల్ గురువారం తెలిపారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో అచ్చంపేట, క్రోసూరు విత్తనాల షాపులను తనిఖీ చేసినట్లు తెలిపారు. అచ్చంపేటలోని శ్రీమణికంఠ సీడ్స్, క్రోసూరులోని శివసాయి సీడ్స్, లక్ష్మీ నరసింహా ఎంటర్‌ప్రైజెస్ షాపులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు ఏఓ చెప్పారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పత్తి విత్తనాలు 242.725 కిలోలు రూ.4,35,883 విలువ చేసేవి సీజ్ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు 267.900 కిలోల పత్తి విత్తనాలు అమ్మకాలు నిలిపివేసినట్లు వివరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్స్‌ఫోర్సుమెంట్ వ్యవసాయధికారి వాసంతి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి

ఈపూరు: ట్రాక్టర్ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ఊడిజర్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మూలె రామిరెడ్డి (30) ఈ ప్రమాదంలో మృతిచెందాడు. రామిరెడ్డి పొలంలో ఉన్న ఎరువును ట్రాక్టర్‌తో సరిచేస్తూ ట్రాక్టర్ ట్రక్కుకు, ఇంజిన్ మధ్యలో ఉన్న రింగ్‌ను సరిచేస్తుండగా లింక్‌లో ఇరక్కుపోయి చాతికి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తరలించారు. రామిరెడ్డికి భార్య, ఇరువురు సంతానం. ఎప్పుడూ నవ్వుతూ ఉండే రామిరెడ్డి మరణ వార్త విన్న గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.